# కంచువిగ్రహాలు

రచన- గుత్తా శ్రీనివాసరావు

వీరయ్యగారికి నలుగురు కొడుకులు - యిద్దరు కూతుళ్లూ - పెద్దకొడుకుల్ని ముగ్గుర్ని తనశక్తికి మించిన చదువులు చదివించాడు అందుచేత తానుకష్టపడి సంపాయించిన ఆరు ఎకరాల మాగాణీ అమ్మాల్సివచ్చింది. యిక తన పేరుతో సెంటుభూమిలేదు చేతులో పదిరూపాయలూ లేవు.

పెద్దకొడుకు లిద్దరూ బి ఏ బి యల్. ప్యాసయ్యి ప్లీడరుపట్టా సంపాయించి మెద్రాసులో చెరొకమేడ అద్దెకుతీసుకుని మనిషినిబట్టి మాట్లాడుతూ కాలాన్నిబట్టి సంపాయించి డబ్బుజాగ్రత్త చేస్తున్నారు. వీరిద్దరికీ బిఏ బియల్ సర్టిఫికెట్ చేతికి రాగానే ప్రక్కవూరు శరభయ్యగారి యిద్దరు కూతుళ్ళనీ యిద్దరు అన్నదమ్ములకూ చెరి 50 వేలూ కట్నంయిచ్చి అతివైభవంగా పెండ్లి చేశాడు

ఆ రోజున వీరయ్యగారుకూడా చాలా సంతోషించారు. మూడోకొడుక్కి యింకా పెండ్లికాలేదు గాని యం. బి. బి. యస్ ప్యాసయ్యి బందరులో డాక్టరు వృత్తిలో బాగానే సంపాయించుకున్నాడు. అనేకులు 60 70 వేలుయిచ్చి పిల్లనిస్తామని వెంటబడుతుంటే చాలదని పెద్దకట్నం కొరకు ఎదురుచూస్తూ బెండకాయలాగా ముదిరి పోతున్నాడు.

వీరయ్యగారి పెద్దకూతురు చాలా అందమైనదని ఒక పెద్దధనికునిబిడ్డ పెండ్లిచేసుకున్నాడు. చిన్నకొడుకు ఫిఫ్తుఫారంలో ప్రవేశించకముందే వీరయ్యగారి ఆర్థికం వెనుకాడింది.... ఈసంవత్సరం ఫస్టుఫారంలో ప్రవేశించుతాడు. పుస్తకాలు లేవు పుస్తకాలు కొనటానికి డబ్బులేదు యింటి దగ్గర తండ్రి సంపాయించే స్థితిలోలేదు తల్లితన చిన్నతనంలోనే కాలంచేసింది. వీరయ్యగారు వీలైనంత అప్పుదొరికిన వరకు తెచ్చి పిల్లల్ని సాకుతూ వచ్చాడు. యిక నెవ్వరూ కానీయిచ్చే పరిస్థితిలో లేరు. నీ ముగ్గురు కొడుకులూ వేలకు వేలు డబ్బుసంపాయిస్తూంటే ఎందుకిక్కడ తిండి లేకుండా మాడతావూ? ఏ కొడుకుదగ్గర కెళ్ళితే ఎవరు కాదంటారూ? నువ్వుతినే నాలుగు మెతుకుల దగ్గర లోభిస్తారా? నువ్వూ నీ పిల్లలూ వెళ్ళి ఏ కొడుకు దగ్గరకైనా హాయిగా వుండేదానికి ఎందుకిక్కడబడి సుఖబడ్డ ప్రాణాలను ఏడిపిస్తావూ? అని వూరువారంతా అంటున్నారు. అందుకని ఒకరోజు ప్రయాణమై బందరులో వున్న చిన్నకొడుకు దగ్గరకెళ్ళి ఒకరోజు వున్నాడో లేదో యిక్కడ వుండటం కష్టం నాన్నా నేనొక్కడినే హోటల్లో తింటూ బాధపడుతున్నాను. యిక్కడ రేషను చాలీచాలని తిండీ మీరుకూడా యిక్కడే వుంటే ఎంతకాలమని హోటల్లో తింటామూ? మెల్లిగా మెద్రాసువెళ్ళి పెద్దన్నయ్య దగ్గరో చిన్నన్నయ్య దగ్గరో వుండండి వాళ్లు చక్కగా పెద్దపెద్ద మేడల్లో సంసారంతో వుంటున్నారన్నాడు కొడుకుమాట కాదనలేక సరేనని తలవూపాడు. మరునాడు సాయంత్రం నాలుగు గంటలకల్లా అంతా స్టేషను వెళ్ళారు మెద్రాసుకి ఒకనిండుటికెట్టు రెండు అరటికెట్లూ తీసుకుని తండ్రికిచ్చి బండి ఎక్కించాడు బండి బయల్దేరేముందు చెల్లెలుకి ఒకరూపాయీ తమ్మునికి ఒకరూపాయీ చేతిలో బెట్టి మెల్లిగా తప్పుకున్నాడు..

ఆరోజుబండి చాలాలేటుగా రావటం చేత మెద్రాసుస్టేషను చేరేసరికి మరునాడు 2 గంట

లయింది. రైలుదిగారు అదేమిటో అరవమట ఎవ్వరిని చూడబోయినా గలగలమంటూ మాట్లా డుతున్నారు. మాపెద్దబ్బాయి యిల్లు ఎక్కడని అందర్నీ అడుగుతున్నారు. ఎవ్వరినడిగినా విని పించికోకుండా పోతున్నారు. కొంతమంది నేరుగా వెళ్ళమంటున్నారు. బందరులో మూడోకొడుకు యిచ్చిన అడ్రసు కాయితం తీసిచూశారు ఆయ డ్రసు ఇంగ్లీషులో వుంది దగ్గరున్న చిన్నకొడుకు ఇంగ్లీషు చదవలేదు. ఎవ్వరో తెలుగాయన కన పడితే చదివించి దారితెలుసుకున్నారు. మొంటు రోడ్డునే నడవటం ప్రారంభించారు తిండిలేక అందరికీ కళ్ళు లోపలికి పోయినవి నడవలేక పోతున్నారు కొడుకుని కూతుర్ని బ్రతిమాలి అన్నదగ్గర తీసుకొస్తానని చెప్పి ఆ రెండు రూపా యలూ తీసుకుని ఒకపొంపెద్దుబండి కట్టించి ఆ బండి ప్రయాణంతో సాయత్రం 6 గంటలకు బలవంతంగా పెద్దకుమారుని యింటికి చేరు కున్నారు.

రెండుమూడు రోజులు జరిగింది పెద్దకోడలు ఏదో వొకవొంకబెట్టి పోట్లాడడం ప్రారంభిం చింది యికనీయింటిదగ్గర వుండగూడదని తిరిగి రెండోకొడుకుదగ్గర కెళదామనుకుంటున్నాడు. ఇంతలో తమ్మునికి టెలిఫోన్‌చేసి తమ్ముని పిలి పించాడు. తమ్ముడు కారులోవచ్చి తండ్రిని చిన్న తమ్ముని చెల్లెల్ని యింటికి తీసుకెళ్ళాడు.

ఒకనెలైనా పూర్తిఅయిందో లేదో యింట్లో గుసగుసలు రుసరుసలు ప్రారంభమయ్యాయి. ఎంతకాలమని ఈగుంపుకి నేను తిండిబెట్టాలని భార్య ప్లీడరుగారితో పోట్లాడుతోంది ఈపోట్లాట వీరయ్యగారి చిన్నకూతురు విని తండ్రితో చెప్పింది ఇకఒక్కక్షణం యిక్కడ వుండగూడ దనుకున్నారు మన మూలకంగా వాళ్ళ సంసా రాన్ని పాడుచెయ్యట మెందుకని తిరిగి స్వగ్రా మం చేరుకున్నారు. బలవంతంగా ఒకసంవత్స రం గడిపారు. చిన్నకొడుకుని పంపించి పెద్ద కూతురిదగ్గర పదిరూపాయలు అడిగి తీసుకు రమ్మంటే వెళ్ళి అక్కడనడగగానే ఈ కరువు రోజుల్లో డబ్బెక్కడున్నదని సమాధానం చెప్పింది నిరాశతో తమ్ముడు తిరిగి యింటికి వెళ్ళిపోయాడు.

ఇకనాహారం లోపించి వీరయ్యగారు మంచం పట్టారు. వీరయ్యగారి పాత స్నేహితుడు వరదా చార్లుగారేవచ్చి వున్నమందుల్లోనే చూసి లోపం లేకుండా ఏవేవో మందులిస్తున్నాడు. నాన్నగారికి ప్రమాదంగా వున్నదని ముగ్గురు అన్నలకూ వుత్త రాలు వ్రాశాడు చిన్నకొడుకు సమాధానంలేదు. అంతఅర్జంటయితే విమానంలో వెళదామని మెద్రా సులో వున్న అన్నదమ్ములిద్దరూ టెలిఫోనులో కూడబలుక్కున్నారు. యిట్లా ఒక వారంగడచింది. వీరయ్యగారు మరణించారు. చిన్నకొడుకూ చిన్న కూతుతూ అంతులేని దుఃఖంలో వున్నారు యిప్పుడు పలకరించే దిక్కులేదు.

వీరయ్యగారి కొడుకులకూ కూతురికి వరదా చార్లుగారే టెలిగ్రాము యిచ్చారు. టెలిగ్రాము అందింది. మేమువచ్చేవరకూ శవాన్ని ఎత్తవద్దని తిరిగి టెలిగ్రామిచ్చి వెంటనే బజారుకెళ్ళి చెరినూరురూపాయలకూ అత్తరు పన్నీరుబుడ్లు సాంబ్రాణి కడ్డీలూ కొని చెరినాలుగు వందలు రూపాయలకూ గుడ్డలూ, 50 రూపాయలకు పూలదండలూకొని విమానంలో ప్రయాణంచేసి సాయంత్రం నాలుగు గంటలకు యిల్లు చేరు కున్నారు మూడోకొడుకూ పెద్దకూతురూ అంత కుముందే వచ్చారు. యిప్పుడంతా ఏడ్చేవాళ్ళే

బ్రహ్మాండమైన పూలపల్లకీ కట్టించారు. వెయ్యిరూపాయలకు తక్కువలేకుండా కానులూ అర్ధనాలూ అణాలుగా చిల్లర మార్పించారు మేళాలూ తాళాలతో వూరంతా శవాన్ని వూరే గించుతూ అత్తరూ పన్నీరు జల్లుతూ మేళతాళాల మోతలమధ్య చిల్లర డబ్బులు విరజిమ్ముతూ నాలుగు బజార్లూ వూరేగించి శవాన్ని అగ్నికి ఆహుతిచేశారు.

తండ్రిగారి కంచువిగ్రహాన్ని తయారు చేయిం చి పెద్దబజారులో సెంటరులో ప్రతిష్టించుతా నన్నాడు పెద్ద కొడుకు. అట్లావీల్లేదు అందరమూ కలిసి ప్రతిష్టించాలన్నాడు రెండోకొడుకు. అట్ల యితే ముగ్గురమూ మూడు విగ్రహాలు చేయించి మూడుబజారుల్లోనూ ప్రతిష్టించాలన్నాడు మూడో కొడుకు సరేనంటే సరే నన్నారు పంచాయితీ బోర్డుకి ముగ్గురూ మూడు వేలుయిచ్చి పర్మిషన్ తీసుకుని ఒకరికంటే ఒకరు పెద్దపెద్దకంచు విగ్ర హాలు చేయించి ఆ కంచువిగ్రహాలను బ్రహ్మాం డమైన వూరేగింపులతో నాలుగుబజార్లూ తిదిగి ముగ్గురూ మూడు బజారుల్లోనూ వీరయ్యగారి కంచువిగ్రహాల్ని ప్రతిష్టించారు.